# స్వయంకృతం

ఆ రాత్రల్లా గోపాలానికి కడుపు దహించుకు పోతున్నట్లుగా ఉంది. చాలా మంది తన చుట్టూ చేరి అపహాస్యం చేస్తున్నట్లుగా ఉంది. ఆ సూటీపోటీ మాటలు వినలేక తను తలొంచుకొన్నట్లుగా ఉంది.

అసలీ గొడవంతా దేనికి? రవి సరిగ్గా బడికెడితే ఇంత దాకా జరిగేదే కాదు. నిన్న జీతం కడదామని స్కూలు కెళ్ళాడు. ఆ జీతం డబ్బుల కోసం తనెన్ని బదవలు పడ్డాడో ఆ పరమేశ్వరునికే తెలుసు. వారం రోజులపాటు కాలికి బలపం కట్టుకొని తిరిగితేగానీ, ఐదు రూపాయలు పుట్టలేదు. ఇందుకోసం తను స్వంత ఖర్చులు తగ్గించు కొంటున్నాడు కూడాను. ఆ రోజే జీతం కట్టడానికి ఆఖరు రోజు. ఆ మర్నాటి నుండీ రోజుకు అణాచొప్పున ఫైన్ చెల్లించుకోవాలి. అలా కట్టిన సందర్భాలూ చాలా ఉన్నాయి.

ఇంతాచేసి స్కూలు కెడితే, అక్కడ రవి లేడు. గత రెండు రోజుల్నించీ వాడు బడికి రావడమే లేదుట! గోపాలం నిర్ఘాంతపోయాడు. అటువంటి దేమన్నా జరిగితే ఆవిడ తనతో అని ఉండేదేనే! కానీ అలా అన్న జ్ఞాపకం తనకు లేదు. ఒకవేళ చెప్పిందేమో! తనే మాటల సందట్లో పడి మరిచి పోయాడేమో మరి!

'కనుక్కొంటాను. ఈ జీతం జమ కట్టుకొని రసీ దిప్పించండి' అన్నాడు గోపాలం.

'మీరు మరోలాగా అనుకోకండి' అన్నది సిస్టర్ మేరీ. 'మీ పిల్లవాడి విషయంలో మీ రేమీ శ్రద్ధతీసుకొంటున్నట్లు లేదు. దగ్గర దగ్గర ఏడెనిమి దేళ్ళున్నాయి. ఇంకా రెండో తరగతిలో ఉన్నాడంటే మీకు మాత్రం ఏం బావుంటుంది చెప్పండి? వాడీడు వారంతా 4, 5 చదువుతున్నారు.'

'ఇంటి దగ్గర చదువుతూనే ఉంటాడు మేడమ్' అన్నాడు గోపాలం; ఇది అబద్ధమని తెలిసికూడా.

సిస్టర్ మేరీ అదోలాగా నవ్వింది. 'నువ్వు చెప్పేదంతా అబద్ధం' అన్నట్లుగా ఉం దా నవ్వు.

'చదవడం లేదని కాదనుకోండి. ఇంత కన్నా బాగా చదివితేగానీ లాభంలేదు. ఒక్క పాఠంరాదు. పట్టుమని పది అంకెలు వెయ్యలేడు. ఇలాంటి పిల్లలు పదిమంది ఉంటే స్కూలుకు మంచి పేరు వస్తుందంటారా?' అన్నది సిస్టర్ మేరీ!

అప్పటికి గోపాలం ఏమీ అనలేదు గానీ, తల బరువెక్కి, భూమిలోకి దించుకుపోతున్నట్లుగా అయింది. తనలో బాటు జీతం కట్టడాని కొచ్చిన నలుగురైదుగురు పెద్ద మనుషులు తన కేసి అదోలాగా చూశారు. బహుశా వాళ్ళ పిల్లలు బాగా చదువుకొంటూ ఉండవచ్చు.

అసలా రోజల్లా గిజాటుగానే ఉంది. చాలా చిరాగ్గా ఇంటి కొచ్చాడు. అప్పటికే రవి నిద్ర పోతున్నాడు. గువ్వ లాగా ముడుచుకు పడుకున్నాడు. కాళ్ళు రెండూ పొట్టలోకి పొదువు కొన్నాడు. చేతులతో ముఖాన్ని కప్పుకొన్నాడు. జుట్టంతా రేగి ఉంది. కాళ్ళమీద దుమ్ముచార లున్నాయి.

రవిని చూడగానే గోపాలానికి ఛర్రున కోపమొచ్చింది. కానీ నిద్రపోతున్న వాణ్ని కొట్టలేకపోయాడు. అప్పటికీ పడుకొని ఉన్నవాణ్ని, కుదిపి పలకరించాడు. వాడోసారి మూలిగి, వెల్లికితలా తిరిగి మళ్ళా నిద్రకుపడ్డాడు.

'ఇప్పుడెందుకండీ వాణ్ని లేపడం?' అన్నది జానకమ్మ.

గోపాలం చిరాగ్గా ఉన్నట్లు ఆవిడ కనిపెట్టింది.

'ఇప్పుడే పిల్లలంతా భోంచేశారు. ... మీరు భోజనానికి లేస్తారా? కాస్సేపుంటారా?' అన్నది జానకమ్మ.

'నాకేం బాగాలేదోయ్! కాస్సేపుండి తింటాను' అన్నాడు గోపాలం కుర్చీలో జారగిలబడుతూ.

జానకమ్మ ఓ క్షణం భర్తకేసి చూసింది. ఆవిడకేమీ అర్థంకాలేదు. నిశ్శబ్దంగా లోపలికెళ్లి, నాలుగు అరిసెలూ, ఇంత ఆవకాయా పళ్లెంలో తీసుకొచ్చి ముక్కాలి పీటమీద పెట్టింది.

'అవునుగానీ, ఇవ్వాళ రవి బళ్లో కెళ్లాడా?' అన్నాడు గోపాలం వాటికేసి చూడకుండానే!

'ఏం! వెళ్ళాడే!' అన్నది జానకమ్మ చంటివాడి మెడదాకా దుప్పటి లాగుతూ.

'నిన్న?' అన్నాడు గోపాలం.

'ఈ వారంలో వాడసలు ఆబ్సెంట్ కాందే' అన్నది జానకమ్మ. రవికేసి చూస్తూ 'ఏమయింది మేమిటి?' అన్నది.

'వాడు నిన్నా, ఇవ్వాళా బడికి రానేలేదుట. పంతులమ్మ చెప్పింది — ఇంటి దగ్గర వేళకే బయలుదేరుతున్నాడుగా?' అన్నాడు గోపాలం.

'ఆఁ' అన్నట్టు తలతిప్పింది జానకమ్మ.

'ఈ యీడుకే ఇన్ని వేషాలేస్తుంటే రేపు పెద్దయ్యాక, వాడింకేం లొంగుతాడో చెప్పండి! ఎనిమిది గాకముందే వేళ యిందో అని నా ప్రాణం తీస్తాడు. రానుపోను బస్సు డబ్బులు గాక, కొనుక్కోవటానికి అణా కావాలంటాడు. సరోసురోపడి అన్నీ ఇస్తుంటేము. వాడేమో, ఇలా చేస్తుండె!' అన్నదిజానకమ్మ.

గోపాలం ఏమీ మాట్లాడలేదు.

'మీ భయముంటే వాడింతదాకా బరితెగించేవాడే కాదు. అమిత ముద్దుచేసి పిల్లల్ని ఎందుకూ కాకుండా చేస్తున్నారు. రేపొద్దున నాలుగంటించి భయం చెప్పండి. అప్పటిగ్గానీ వాడు అంకెకు రాడు' అన్నది జానకమ్మ.

గోపాలం 'సరే' నన్నట్టు తలూపాడు. అప్పుడే వెనకటి సంగతొకటి జ్ఞాపకం వచ్చింది. రవీ, రెండోవాడూ నెమలి కన్ను కోసం పేచీ పెట్టుకొన్నారు. జానకమ్మ పొయ్యిదగ్గరుంది. 'చెరోదెబ్బ వేసి విడదియ్యక అలా చూస్తారేమండీ?' అన్నదావిడ విసుక్కుంటూ.

'నువ్వేకొట్టు. నేనలా చాటుకెడతాను. పిల్లల్ని కొట్టటం నా వల్ల కాదు' అన్నాడు గోపాలం.

అంత చిరాకూ ఎక్కడి కెళ్ళిందో గానీ జానకమ్మ ఫక్కున నవ్వింది. ఎంత కోపమొచ్చినా తను దాచుకోగలదు. పిల్లల్ని కొట్టడమంటే మాత్రం, తన వల్ల కాదు.

* * * *

మామూలుగానే, ఈరోజూనా రవి తన దగ్గరే పడుకొన్నాడు. కాళ్ళు రెండూ గుండెలమీద పెట్టి దుప్పటంతా తనొక్కడే లాక్కొని పడుకొన్నాడు. ఓ చెయ్యి తలకింద పెట్టుకుని, మరో చెయ్యి తన మెడకు చుట్టాడు.

'మామూలుగా కంటె నిద్రపోతున్నప్పుడు పిల్లలు అందంగా ఉంటారెందుకో!' అనుకొన్నాడు గోపాలం.

రవిని దగ్గరకు తీసుకొని, మెత్తగా ముద్దుపెట్టుకొన్నాడు.

'ఈ వెధవ సరిగ్గా చదువుకొంటే ఎంత బావుణ్ను!' అనుకొన్నాడు గోపాలం.

గోళ్ళతో వాడిజుట్టంతా సర్దాడు.

'వీణ్ని కొట్టాలంటే —'

కానీ ఆ ఉదయం అనుకొన్నంత పనీ చేశాడు. కాఫీలు అయ్యాక కొడుకును దగ్గరకు పిలిచాడు గోపాలం. వాడొచ్చి, వాళ్ళో కూచున్నాడు. విషయం ఎట్లా మొదలెట్టాలో గోపాలానికి చాలా సేపటి దాకా తెలియలేదు.

'నువ్వు రోజూ బళ్ళోకి పోతున్నావట్రా?' అన్నది జానకమ్మ, వచ్చే నవ్వు నాపుకొంటూ.

'ఓ' అన్నాడు రవి.

కానీ ఆ గొంతులో గట్టితనం లేదు.

'అబద్ధమాడితే చర్మం వొలిచేస్తాను. నిజం చెప్పు. నిన్నా మొన్నా, నువ్వు బళ్ళోకెళ్ళావా?' అన్నది జానకమ్మ.

రవి మాట్లాడలేదు. నాన్న కేసీ, అమ్మ కేసీ, బిక్కు బిక్కుగా చూశాడు.

'మాట్లాడవేంరా?' అన్నాడు గోపాలం.

'వెళ్ళలేదు' అన్నాడు రవి నంగినంగిగా.

'ఎందుకని?' అన్నాడు గోపాలంకోపం తెప్పించుకొంటూ.

ఎందుకనో రవి చెప్పలేదు.

గోపాలం — వొళ్ళో కూచున్న కొడుకును ఒక్క తోపు తోసి కిందికి పడనెట్టాడు. పడ్డవాణ్ని చొక్కా పట్టుకొని లేవనెత్తి చెంపమీద చెళ్ళుమని మరొకటి అంటించాడు.

'ఇప్పుడు చెప్పు! ఎందు కెళ్ళలేదు ?'

రవి, ఆ దెబ్బతో గింగిరాలు తిరిగిపోయాడు. ఇల్లెగిరిపోయేలాగా ఏడుపు సాగించాడు.

'చెప్ప వేంరా పుండాకోర్ ?' అన్నాడు గోపాలం.

ఈసారి రెండో చెంపమీద వాయించాడు. ఆ ఆదుటుకు తూలి తలుపుమీద పడ్డాడు. తలకు ఠక్కున పొడుచుకొంది తలుపు. విసురుగా జానకమ్మ మీద పడ్డాడు రవి.

జానకమ్మ ఒక్క విసురు విసిరిందిగానీ, పోతూపోతూ మెల్లగా కొట్టమన్నట్టు సైగచేసి మరీపోయింది.

గోపాలం ఎడపెడా మరి నాలుగంటించాడు. తనవేళ్ళే మంటలెక్కాయి. రవి రెండు బుగ్గలూ ఎఱ్ఱగా కందాయి. తల వెనకనుండి, కొద్దిగా రక్తపుచెమ్మ ఉరలుతూ ఉంది. ఏడ్చీఏడ్చీ కళ్ళన్నీ వాచాయి.

'నాన్నా! కొట్టబోకు నాన్నా! ఇంకెప్పుడూ అబద్ధమాడను. నాన్నా వొద్దువొద్దు రోజూ బళ్ళోకిపోతా. బాగా చదువుకొంటా. ఈసారి బళ్లోకి పోకపోతే పెద్దపులికి పడెయ్యి. నాన్నా! నాన్నా! కొట్టొద్దు, అమ్మోయ్, అమ్మోయ్, ఇంకెప్పుడూ చెయ్యనే అమ్మోయ్!'

గోపాలం శాంతించాడు.

'రోజూ బళ్ళోకి పోతావా ?' అన్నాడు.

'ఆ' అన్నట్టు తల తిప్పాడు రవి.

'అబద్ధమాడతావా ?'

'ఊఁహూ' అన్నట్టు అడ్డంగా తల తిప్పాడు రవి.

'బళ్లోనించి రాగానే చదువు కొంటావా?'

'ఆ' అన్నట్టు తల తిప్పాడు రవి.

'ఆటలాడ్డానికి పోతావా?'

'పోను' అన్నట్టు తల తిప్పాడు.

'ఛీ వెధవా! అన్నంతిని బళ్లోకెళ్లు. చక్కగా చదువుకో! నీ ఈడు వాళ్ళంతా ఎంత బాగా చదువుతున్నారూ? నువ్వేలా ఏడుస్తున్నావ్? వాళ్ళను చూస్తే సిగ్గెయ్యడం లేదుట్రా.'

జానకమ్మొచ్చి కొడుకును తీసుకెళ్ళింది.

ఆ రోజల్లా కనీసం పదిసార్లయినా రవి జ్ఞాపకం వచ్చాడు గోపాలానికి. తన కసలు పిల్లలను కొట్టటం చేత కాదు. అలా కొట్టేవారంటే వల్లమాలిన అసహ్యంకూడా వేస్తుంది. అలాంటిది ఇవ్వాళ తనే చెయ్యి చేసుకోవలసి వచ్చింది.

గోపాలం మనస్సంతా కకావికలుగా ఉంది. జబ్బుపడి నంత నీరసంగా ఉంది.

* * *

'అలా ఉన్నావేం?' అన్నాడు గోపాలం భార్యను చూస్తూనే!

జానకమ్మ కళ్ళు నీటితో నిండి పోయాయి.

'ఏమయిందే?' అన్నాడు గోపాలం ఆదుర్దాగా.

'నాన్నా! నాన్నా! మరేమోనే! రవన్నయ్యే ఇంకానే, ఇంటికి రాలేదు నాన్నా!' అన్నాడు రెండోవాడు.

గోపాలం మోకాళ్ళ మీద ఎవరో ఫెడీమని కొట్టినట్లయింది.

'ఎక్కడికి వెళ్ళాడు?' అన్నాడు గోపాలం పొడారిపోయిన గొంతుతో.

'ఉదయం మీ రుండగానే బళ్ళోకి వెళ్ళాడా? ఇంత వరకూ రాలేదు. రోజూ నాలుగున్నర కల్లా వస్తాడు. బస్సు అందకపోతే అయిదింటికన్నా వొస్తాడు' అన్నది జానకమ్మ.

గోపాలం టైం చూశాడు. దగ్గర దగ్గర ఏడుకా వస్తోంది.

'మీతో ఏమాటన్నా చావే! కాస్త భయం చెప్పండీ బాబూ అంటే, ప్రాణాలు ఎగిరిపోయేట్టు కొడతారాయె?' అన్నది జానకమ్మ పమిట చెంగుతో ముక్కులు తుడుచుకుంటూ.

తను చాలా తీవ్రంగా కొట్టానన్న సంగతి మరోసారి మనస్సులో మెసిలి బాధపడ్డాడు గోపాలం.

'నరసమ్మత్తయ్య కొడుకు ఆ దెబ్బలు తట్టుకోలేక నేగా పోయింది! మూణ్ణెల్లయింది. ఇంతవరకూ అంతు చిక్కలేదు. దగ్గర దగ్గర వెయ్యి రూపాయల దాకా ఖర్చు పెట్టారు,' అన్నది జానకమ్మ.

'నువ్వెక్కడన్నా వెదికావా?' అన్నాడు గోపాలం ఎండిపోయిన గొంతుతో.

'ఈ చుట్టుప్రక్క చూశాను. ఎక్కడా లేడు' అన్నది జానకమ్మ దుఃఖం పుక్కిలింతలయ్యి. 'మీ చేతనైతే ఓ మాటు మందలించండి, లేకపోతే ఊరుకోండి, అంతేగాని, గొడ్డును బాదినట్టు బాదితేనేను సహించేది లేదు.

గోపాలం కిక్కడ మనలేదు. సైకిలెక్కి సరాసరి స్కూలు కెళ్ళాడు. తలుపులకు తాళాలు వేసున్నాయి. ముసలి కాపలావాణ్ని అడిగితే, 'ఇంతమంది పిల్లల్లో నా కెక్కడ జ్ఞాపకం ఉంటుంది బాబూ?' అన్నాడు.

గోపాలంలో తొందర పాటు ఎక్కువైంది. సైకిలు తొక్కుతూనే రోడ్డుకు ఆపక్క ఈపక్క చూస్తున్నాడు. రవి రూపురేఖలు చెప్పి, 'అటువంటి పిల్లవాడు కనిపించాడా?' అని ఎదురు పడిన వారిని అడిగాడు.

హఠాత్తుగా అతని కింకో ఆలోచన వచ్చింది. రోడ్డు మీద సైకిలాపి వంతెన కింద చూశాడు. చెట్ల గుబురు దగ్గరా, నీటిగుంట దగ్గరా చూశాడు. ఎక్కడా ఎవ్వరూ లేరు. అతనికి సైకిలుతొక్కే ఓపిక కూడా లేదు. అందుకని నడిపించుకొంటూ వస్తున్నాడు.

తన ఇంటిముందు పాతిక ముప్పయ్ మందిదాకా ఉన్నారు.

'రవిగానీ దొరికాడా ఏం?' అనుకున్నాడు.

సైకిల్ మోతవిని —

'కనిపించాడా?' అని అడిగారెవరో.

గోపాలం నిర్విణ్ణుడైనాడు. జనం మూగితే కుఱ్ఱవాడు వచ్చాడను కొన్నాడు తను.

'అయినా అదేం కొట్టడమండీ! వెధవ చదువు ఇవ్వాళ గాకపోతే, రేపొస్తుంది. చిన్నప్పుడు అంతా అట్లా ఏడిచిన వాళ్ళమే. ఇప్పుడు మీరెన్ని వేలుపోస్తే వాడొస్తాడు?' అన్నాడు ఒకాయన.

'ఏమో నాయనా! కాలం బాగాలేదు. పిల్లల్ని పట్టుకొనే వాళ్ళు ఊళ్ళ మీదికొచ్చారట. పట్టుకొని పాకిస్తాన్

తీసుకుపోతారట. ఊరుఊరంతా అ గుబ్బుగా చెప్పుకొంటుంటే నీకెలా తెలియలేదయ్యా! గొడ్డును బాదినట్టు బాత్తావా? నువ్వు మనిషివా పశువ్వా?' అని మందలించా డాకాయన.

గోపాలం నిలువునా నీళ్ళుగారి పోయాడు. రవిని, భూతాల్లాంటి మనుషులు పట్టు కెళ్ళినట్లూ వాడు భయంతో 'నాన్నా నాన్నా!' అని కేకలు పెడుతున్నట్లూ అనిపించింది. అలానే దుమ్ములో కూచుని, వెక్కి వెక్కి ఏడిచాడు గోపాలం.

రాత్రి ఎనిమిదిన్నర కూడా దాటి పోయింది. ఒక్కరొక్కరే దాటి పోయారు. చిన్న వాళ్ళిద్దరూ జానకమ్మ వొళ్లో పడుకొన్నారు.

'సరే, లోపలికి పద,' అన్నాడు గోపాలం రెండోవాడ్ని భుజంమీాది కెత్తుకొంటూ.

జానకమ్మ చంటివాణ్ని రొమ్ముల కొత్తుకొని, మరో సారి బావురుమంది.

'ఎంత పాడు పని చేశారండీ!' అని ఏడుస్తూనే ఉంది జానకమ్మ.

గోపాలం మెట్లమీాద నిలబడి అటూ ఇటూ పిచ్చిగా చూస్తున్నాడు. ఏమాత్రం అలికిడైనా 'రవీ!' అని పిలుస్తున్నాడు. కాని జవాబు ఉండేది కాదు.

రవిలేని ఇంట్లో పడుకోవటానికి మనస్సొప్పలేదు. వాడి మాటలూ, పడుకొనే పద్ధతీ జ్ఞప్తి కొచ్చి, కుళ్ళి కుళ్ళి ఏడిచాడు గోపాలం.

'నాన్నా!'

ఉలిక్కి పడ్డాడు గోపాలం.

'రవీ!' గభాలున లేచి చీకట్లోకి పరుగెత్తాడు గోపాలం.

'నేనే నాన్నా!' అన్నాడు రవి చీకట్లోంచి.

గోపాలం ఎదురు వెళ్ళి కొడుకును అమాంతంగా చేతుల్లోకి తీసుకొన్నాడు. సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు. కొడుకు బరువుకు తూలుతూ, అడుగులు వేసుకొంటూ మెట్లెక్కుతున్నాడు.

ఆ సరికి జానకమ్మ కూడా కళ్ళు నులుముకొంటూ వాకిట్లో కొచ్చింది. కొడుకును చూడగానే ఆమెకు దుఃఖం పుక్కిలింత లయింది. భర్త చేతుల్లోంచి కొడుకును అందుకొని, గుండెల కొత్తుకొంది.

'ఇంతసేపూ ఎక్కడికి వెళ్ళావు నాయనా?' అన్నది జానకమ్మ.

రవి తండ్రి ముఖంకేసి భయం భయంగా చూశాడు.

'చెప్పు బాబూ! ఎక్కడికి వెళ్ళావ్?'

రవికి ఉదయంపూట కనిపించిన తండ్రి ఉగ్రరూపం మనస్సులో మెదలి ఉండాలి.

'ఇంకెప్పుడూ పోను నాన్నా! నన్ను కొట్టకు నాన్నా!' అంటూ తల్లి మెడను గట్టిగా కౌగలించుకొన్నాడు రవి.

'మీ రవతలి కెళ్ళండి బాబూ? వాడి సంగతేమిటో నేను చూచుకొంటాను. బంగారంలాంటి పుత్రుణ్ణి బెదురుపెట్టి పాడుచేశారు.' అంటూ జానకమ్మ కొడుకును లోపలకు తీసుకెళ్ళింది. మురికి గుడ్డలు విప్పింది. వేణ్ణీళ్ళుబెట్టి వొళ్ళంతా తుడిచింది. చాకింటి గుడ్డలు తొడిగింది. పాలుపోసి అన్నం బెట్టింది. వాడు అన్నం తింటున్నప్పుడు అడిగింది—

'ఇప్పటిదాకా ఎక్కడికి వెళ్లావు నాయనా! నీ కోసం ఎంతసేపు వెదికామని?' అన్నది జానకమ్మ పైట చెంగుతో వేడిపాలను చల్లార్చుతూ.

'మేరీ పంతులమ్మ గారింటికి వెళ్ళానమ్మా!' అన్నాడు రవి భయపడుతూనే.

'ఎందుకు బాబూ?' అన్నది జానకమ్మ ఆశ్చర్యంగా.

'రెండురోజులు పాఠాల్లో వెనకపడ్డాను గదులే! చెప్పించుకొందామని వెళ్ళాను.'

గోపాలానికి ఈ మాటలు వినిపించాయి. అతని హృదయము ఆనందంతో నిండిపోయింది.

పిల్లలందరూ నిద్రపోయాక పొడిదగ్గు దగ్గుతూ లేచి కూచున్నాడు గోపాలం.

'నిద్రపొయ్యావులే?' అన్నాడు.

'ఊఁ' అన్నది జానకమ్మ.

గోపాలం లేచి భార్య మంచంమీద కూచున్నాడు. జానకమ్మ కాళ్ళు ముడుచుకొని ఆ పక్కకు తిరిగి పడుకొంది.

'మొత్తానికి మనవాడు తెలివి గలవాడే సుమా!' అన్నాడు గోపాలం భార్య భుజంమీద చెయ్యి వేసి.

రవి బుగ్గలు ఎర్రగా కమిలి ఉన్నాయి. మూడు వేళ్ళ చారలు, స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఏమనుకొన్నాడో ఏమోగానీ గోపాలం ఛటుక్కున లేచి తన మంచంమీదికి వొచ్చాడు. 'కొట్టను, కొట్టను, ఇంకెప్పుడూ కొట్టను' అని తనలో తాను చాలాసేపు గొణుక్కున్నాడు గోపాలం.